# యం. శర్మ బి. ఏ. ఎల్. టీ.

శర్మ బి. ఏ ప్యాసు అయినాడు. అయితే ఏం లాభం! జీవితంలో ఒక్క తప్పుపని చేశాడు. దాని ఫలితం ఇప్పటికీ అనుభవిస్తున్నాడు. ఇక ముందూ అనుభవించక తప్పదు. అదేమిటీ అంటే వెధవ మాస్టరీ వృత్తి అవలంబించటమే! ఆ వచ్చే జీతం చాలి చాలకుండా ఉంది.

శర్మ పొద్దున్నే స్నానంచేసి అతుకులచొక్కా తొడుక్కొని అది కనపడకుండా పైన ఉత్తరీయం కప్పుకొన్నాడు. తన దారిద్ర్యాన్నిచూచి నవ్వుకొన్నాడు.

వీధి తలుపుతీసి గుమ్మంలో నుంచుని వెనక్కు తిరిగి చూశాడు. 'అహా! మరేం ఫరవాలేదు, ఆవిడ ఎక్కడో వంట ఇంట్లోఉంది. ఆవిడ రాకముందే వీధిలో పడితే మంచిది.' ఇల్లా అనుకొన్నాడు.

'వెడుతున్నారా ?'

ఈ కేకవిని ఉలిక్కిపడి వెనక్కు తిరిగిచూడక తప్పింది కాదు.

తాను వెడుతున్న సంగతి ఆమెకు ఎల్లాగ తెలిసిందో అని ఆశ్చర్య పడవలసిన పని అంతగాలేదు. ఏ పిల్లచెప్పినా చెప్పవచ్చు. కాకపోయినా ఆటసిది ప్రతి విషయం చెపుతుంది. తానువస్తూ ఉంటే నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉండ

గానే, పరుగెత్తికెళ్ళి 'నాన్న వస్తున్నారే, అమ్మా' అని చెప్పేస్తుంది.

తాను వెడుతూఉంటే— వెడుతున్నారేవ్ అని చెప్పేస్తుంది.

శర్మ జీవితంలో ఇది ఒక్కటే ఆనందాన్ని ఇచ్చే విషయం. మహారాజులు వెడుతూవున్నా వస్తూఉన్నా ఇల్లాగ చెపుతూ ఉంటారు. ఈ విషయంలో మటుకు శర్మకు మహారాజులకు జరిగే మర్యాద జరుగుతున్నది.

వెడుతున్నారా అని అంటూ ఆవిడ రానే వచ్చింది. శర్మ తలఊపి వెడుతున్నా నన్నాడు వెంటనే అన్నది. సబ్బు బిళ్ళా... పాలడబ్బా, చేంతాడు... ఏదైనా కూర ... కావాలి. బొత్తిగా ఇబ్బందిగా ఉంది!

శర్మ తెల్లముఖం పెట్టాడు. ఒకక్షణంసేపు ఆ గడపపైనే నుంచుని, నడిచి పోయినాడు.

పాపం శర్మముఖం చూస్తే ఎవరికైనా జాలివేస్తుంది ఆ నిమిషంలో. ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాడు. అతడు ముందు వెడుతూవుంటే వెనకనుంచి ఎవరో పిలిచారు అతడు పలకలేదు. అసలు అతనికి వినిపిస్తేనా ?

ముందు బండ్లు, కార్లు వస్తున్నాయి అనే జ్ఞానంకూడా లేనట్టుంది. ఈ దౌర్భాగ్యుడు ఏ కారుక్రింద అయినా పడి చచ్చిపోతాడేమో! అంత పరధ్యానంగా ఉన్నాడు.

స్నేహితులుఎదురై చిరునవ్వునవ్వారు. శర్మ వాళ్ళను చూడలేదు. హెడ్ మాస్టరు కూడా ఎదురుగా వచ్చాడు.

శర్మ నమస్కారమైనా పెట్టలేదు, మాడలేదు. తలొంచుకు వెళ్లిపోయినాడు.

సబ్బుబిళ్ళ, చాంతాడు, కూరపాలడబ్బా ఈనాలుగు మాటలే అతడు మాటి మాటికి అనుకొంటున్నాడు ఈనాలుగు వస్తువులే అతని కళ్ళకు కనిపిస్తున్నాయి. శర్మకు మతి పోయినట్లే ఉంది.

శర్మ నడిబజారులో ఒకపక్కన నుంచున్నాడు. పిచ్చి చూపులు చూస్తున్నాడు.

ఇంతలో చేంతాళ్ళు అమ్మేమనిషి ఒకడువచ్చి చేంతాడు కావాలా బాబూ అన్నాడు. శర్మ కావాలె అన్నాడు.

ఇంకొకడు వచ్చి గొల్లభామ మార్కు పాలడబ్బా కావాలాండి? అన్నాడు. శర్మ కావాలన్నాడు.

ఇంకొక ఆసామి సబ్బుబిళ్ళలు పట్టుకొచ్చి సబ్బుబిళ్ళ కావాలా బాబూ అన్నాడు. శర్మ కావాలన్నాడు.

మరొకడు వచ్చి, తోటకూర కావాలండీ స్వామీ అని అడిగాడు. శర్మ కావాలన్నాడు, ఈ నలుగురూ శర్మ చుట్టూ నుంచున్నారు. అతడు ఏదో ఆలోచిస్తూ నుంచున్నాడు. ఎవరికోసమో నిరీక్షిస్తున్నాడు. వీధినివెళ్ళే ప్రతి వ్యక్తిని పరీక్షగా చూస్తున్నాడు. అంతేకాని తనకు కావలసిన వస్తువులు తీసుకొని వాళ్ళను పంపివేయాలని అతనికి తోచలేదు.

ఆ సంగతూ నిలబడే ఉన్నారు. పెద్దమనిషి ఏదో ఆలోచిస్తున్నాడు, తొందర పెడితే బాగుండదు. అని వాళ్లు అనుకొని ఉంటారు.

పదినిమిషాలు గడిచింది. శర్మ మాట్లాడలేదు. తనకు కావలసిన వస్తువులు తీసికొని డబ్బుఇచ్చి వాళ్ళను పంపిస్తే తీరిపోయేది. ఎంతసేపటికీ కొనడే! అసలు వాళ్ళవంకనైనా చూడలేదు.

శర్మ నుంచుని నిద్రపోతున్నాడా ఏం కర్మం! వాళ్ళు మటుకు ఎంతసేపని నుంచుంటారు! నాలుగుచోట్ల తిరిగి అమ్ము కోవలసిన వాళ్ళుగదా! అప్పటికీ కాసేపు మాట్లాడలేదు. చివరకు అడిగారు

అసలు కూరకు తోటకూర కావాలాండి?

కావాలె.

సబ్బు బిళ్ళా?

కావాలె

పాలడబ్బా కూడా కావాలా అండి బాబూ?

కావాలయ్యా.

చేంతాడూ?

అదీ కావాలె.

నిద్రమత్తులో ఉన్నవాడిలాగ శర్మ జవాబులు చెప్పాడు.

సరే కొంటాడుగదాఅని వాళ్ళు ఇంకో నిమిషం నుంచున్నారు. శర్మ ఎవరికోసమో చూస్తునే ఉన్నాడు. వీళ

వైపు తిరగలేదు వీళ్ళమటుకు ఎంతసేపని కూర్చుంటారు! విసుగుపుట్టింది బాబూ అన్నీ కావాలని అందర్నీ నుంచోబెడితిరి! కొనరేం? అన్నాడు, అందులో ఒకడు.

ఉలిక్కిపడి శర్మ అన్నాడు. ఇంకొకటి కావాలయ్యా అదికూడా దొరుకుతుందేమో నని చూస్తున్నాను!

ఏమిటి బాబూ, అన్నీ దొరుకుతయ్యి. అన్నాడు మరో ఆసామి.

'అదే డబ్బు కావాలయ్యా ఎవరైనా ఇచ్చేవాళ్ళు కనపడతారేమోనని చూస్తున్నాను' అన్నాడు శర్మ.

ఆపళంగా ఆ నలుగురూ నాలుగు మాటలూ అన్నారు. డబ్బులేకుండా నన్నెందుకు నుంచోబెట్టావ్? నేను అప్పుడే అనుకొన్నాను ఇది కొనేముఖం కాదని! శర్మ వంచినతల ఎత్తలేదు.

ఇంత మందిని నుంచోబెట్టాను. కొనకపోతే వీళ్ళు ఊరుకొంటారా అని అతనికి తోచలేదు. ఏదో ఊహాలో ఉన్నాడు. రెండురూపాయలు అప్పు ఇమ్మని ఎవరిని అడుగుదామూ అని అతను ఆలోచిస్తున్నాడు.

బజారువెంట వెళ్ళే ప్రతివాడి జేబులోనూ లావాటి పర్సుఉంది. 'నాగతి ఇల్లా ఎందుకు కావాలె. వాళ్ళందరి కంటేకూడా ఎక్కువ చదువుకొని దౌర్భాగ్య స్థితిలో ఉన్నానేం? ఇవి అతని ఆలోచనలు.

ఇంటి దగ్గర పాలు కావాలె బిడ్డకు. నీళ్ళు తోడుకుంటానికి బొక్కెన లేదు. ఏ బిందెలోనైనా తోడు కొందా

మంటే చేంతాడు కావాలె. సబ్బుబిళ్ళ అయిపోయి వారం రోజులైంది. ఆ పూటకు కూర లేదు.

అన్నీ కావలసిన వే!

అందుకనే కావాలా అని అడిగితే కావాలన్నాడు. తెలివి తక్కువ శర్మ. వాళ్ళను అంతసేపు నుంచోబెడితే వాళ్ళు ఊరుకుంటారా? బేగాలు పోయినాయని గోల పెట్టారు. నానా మాటలుఅన్నారు కూడా మర్యాద తెలుసుకోకుండా!

ఇంతలో ఇక్కడేదో గొడవ జరుగుతున్నదని నలుగురూ పోగైనారు. సంగతంతావిని అందరూ శర్మచేసింది తప్పుపని అని చెప్పారు. దగ్గరలో ఉన్న పోలీసు కానిస్టేబు కేక లేస్తున్నాడు.

శర్మకు ఏమీ తోచలేదు. ఇంకా కాసేపుఉంటే చాలామంది చేరట౦, కానిస్టేబు తనపేరు వ్రాసుకోటం జరుగుతుంది.

యం. యస్. శర్మ, బి. ఏ., ఎల్, టి, సీనియర్ హిస్టరీ మాస్టరు గారికి, అప్పుడొక ఉపాయం తోచింది. అతని జేబులో నాలుగు అణాలు ఉన్నయి, అవితీసి, ఆ నలుగురికీ, తలో అణా ఇచ్చి, పొండిరా బాబూ, అల్లరి పెట్టకండి అని బ్రతిమిలాడుకొన్నాడు. వాళ్ళకు ఉత్తపుణ్యానికి తలొక అణా వచ్చింది. నిజానికి వాళ్ళు సంతోషంగా పోవలసిందే కదా! అంహ అట్లా పొలేదు వాళ్ళు. సణుక్కుంటూ, ప్రొద్దున్నే ఎవరి ముఖం చూశామో, ఈ బడి పంతులు దాపరించాడు మనకు, అని తిట్టుకొంటూ వెళ్ళి పోయినారు.

"కూర లేకపోతేమానె! చేంతాడు లేకపోతేమానె! సబ్బు లేకపోతే పోయింది! పాలడబ్బా లేకపోతే ఎల్లాగ??

ఆ పావలా అన్నా ఉంటే, ఆ రోజుకు ఆవు పాలన్నా కొని బిడ్డకు పోసేవాళ్లు. అది కూడా వదిలింది!

దౌర్భాగ్యుడా, మైనంపూడి శ్రీరామశర్మ బి. ఏ., ఎల్. టి, ఇక ఇంటికి పో!

ఆవిడ నాలుగూ పెడుతుందిలే. కాకపోయినా ఆవిడ, ఎన్నిసార్లు అన్నది, ఈ వెధవమాస్టరీ ఉద్యోగం వదిలిపెట్టి, రిజిష్టరీ ఆఫీసులో ప్యూను పనికి కుదరమని! నీవు విన్నావూ? పో! నీ గతి ముందు ఉందిలే!" ఇల్లా తనకు తాను చెప్పుకొని శర్మ బిక్కముఖంతో ఇంటిదారి పట్టాడు.